క్లుప్తంగా

తాళ్లపేట పీహెచ్‌సీ తనిఖీ



ఓఆర్‌ఎస్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో మందుల నిల్వలను పరిశీలించారు. రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందునా, వడదెబ్బ సోకకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకునేలా వైద్య సిబ్బంది తగిన అవగాహన కల్పించాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయన వెంట ప్రోగ్రాం ఆఫీసర్స్ ఫయాజ్‌ఖాన్, శివప్రతాప్ ఉన్నారు.

మే డే పోస్టర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ సీహెచ్‌పీలో మంగళవారం మే డే ఉత్సవాల వాల్ పోస్టర్లను ఏఐటీయూసీ నాయకులు ఆవిష్కరించారు. కార్మికుల పోరాటాలను, కార్మికుల ఐక్యతను చాటే ఈ మే డే ను కార్మికులంతా ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి అక్బర్ అలీ, బ్రాంచి కార్యదర్శి ఆంజనేయులు, ఇప్పకాయల లింగయ్య, మిట్టపల్లి పౌల్, హరిరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలఅగ్రికల్చర్: పాత మంచిర్యాల 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ జాన్ ప్రకటనలో తెలిపారు. ఏసీసీ సబ్‌స్టేషన్, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని కాలనీలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రంథాలయం ప్రారంభం

దండేపల్లి: మండలంలోని బేహరూన్‌గూడ గిరిజన గ్రామంలో లక్సెట్టిపేట బాలికల ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల సౌజన్యంతో సావిత్రిబాయి పూలే వేసవి గిరి గ్రంథాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆగ్లం, తెలుగు కథల పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచారు. గ్రామంలోని విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మజ్జిగ పంపిణీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఐబీ చౌరస్తాలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ నేషనల్ ప్రెసిడెంట్ అయ్యప్పదాసు ఆదేశానుసారం చలివేంద్రం, మజ్జిగ పంపిణీ చేశారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ రాష్ట్ర అధ్యక్షుడు తిరుమల్‌రావు, జిల్లా అధ్యక్షుడు రాజ్ కిరణ్, ఏబీఏపీ సభ్యులు పాల్గొన్నారు.

షెడ్ల కూల్చివేత



షెడ్లు కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని అర్చనా టెక్స్ చౌరస్తా వద్ద అజయ్ ఎంటర్ ప్రైజెస్ దుకాణం ఎదుట, మున్సిపల్ స్థలంలో అక్రమంగా షెడ్డు వేసి దుకాణాన్ని నిర్వహిస్తున్న వాటిని మంగళవారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. రోడ్డును ఆనుకుని వేసినటు వంటి అక్రమ నిర్మాణాల తొలగింపులో భాగంగానే రేకులతో వేసిన షెడ్డును తొలగించినట్లు మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య తెలిపారు.

బీఎస్పీ క్యాంపెనర్‌గా కాదాసి రవీందర్

శ్రీరాంపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ స్టార్ క్యాంపెనర్‌గా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, శ్రీరాంపూర్‌కు చెందిన కాదాసి రవీందర్‌ను నియమించినట్లు పార్టీ అధ్యక్షుడు మంద ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రవీందర్ బీఎస్పీ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తారని పేర్కొన్నారు. పార్టీ విధివిధానాలను, ఓటు యొక్క ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకువెళ్లి విస్తృత ప్రచారం చేస్తానని ఈ సందర్భంగా రవీందర్ పేర్కొన్నారు.

హనుమాన్ జయంతి

భీమారంలో పూజలు చేస్తున్న హనుమాన్ స్వాములు





దండేపల్లి: మేదరిపేటలో ఆంజనేయస్వామికి పూజలు



జన్నారం: పైడిపెల్లి ఆలయంలో హోమం కాలుస్తున్న భక్తులు

తాండూర్/జన్నారం/చెన్నూర్‌రూరల్/భీమారం/బెల్లంపల్లిరూరల్/దండేపల్లి/మందమర్రిరూరల్/కాసిపేట/చెన్నూర్: హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జై హనుమాన్ నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మారుమోగాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో అర్చకులు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేక పూజలు నిర్వహించి, చందనం వేసి తమలపాకులు, మల్లెపూల దండలతో అలంకరించారు. పలు రకాల నైవేద్యాలు స్వామి వారికి సమర్పించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయ స్వామి దీక్షాపరులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



తాండూర్: కోదండ రామాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



ఒత్కులపల్లిలో అభయాంజనేయ స్వామి ఆలయంలో...



మందమర్రిరూరల్: ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు



చెన్నూర్ మారుతి హనుమాన్ మందిర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

'బీజేపీ,బీఆర్‌ఎస్‌లను చిత్తుగా ఓడించండి'

బెల్లంపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను చిత్తుగా ఓడించాలని ధర్మ సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి మంద రమేష్ మహరాజ్ ప్రజలకు పిలుపునిచ్చారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలు, అట్టడుగు వర్గాల అభ్యున్నతి, దళితులు, బహుజనుల పక్షాన తమపార్టీ చిత్తశుద్ధితో పోరాడుతుందన్నారు. పార్టీ చెప్పు గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంగపల్లి రామస్వామి, నాయకులు తాళ్లపల్లి చంద్రశేఖర్, బోయిని సదానందం, దుర్గం హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రోగ్రెస్ కార్డులు అందజేత

దండేపల్లి: మండలంలోని అన్ని పాఠశాలల్లో మంగళవారం పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఒకటి నుంచి తొమ్మిది తరగతులకు ఈ నెల 22 వరకు నిర్వహించిన వార్షిక పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులతో కూడిన ప్రోగ్రెస్ కార్డులను పేరెంట్స్ సమక్షంలో విద్యార్థులకు అందించారు. వేసవి సెలవులను చక్కగా సద్వినియోగం చేసుకోవాలని, ఎండలకు తిరగకుండా జాగ్రత్తగా, నీడపట్టున ఆటలు, పై తరగతుల పుస్తకాలు చదవాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు.

చలివేంద్రం ఏర్పాటు

జన్నారం: మండల కేంద్రంలోని ఎస్బీఐ పక్కన లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం వేసవిలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చుతున్నట్లు తెలిపారు. వేసవి ముగిసే వరకు ప్యూరిఫైడ్ చల్లనినీటిని అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి రాజేందర్, కోశాధికారి సురేశ్, జిల్లా, మండల సభ్యులు అనుముల రాజన్న, అంజుతరావు, గుండ సుధాకర్, మల్యాల బాపన్న, తోట లచ్చన్న, గుండ పవన్‌కుమార్, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవం



పాల్గొన్న కళాశాల అధ్యాపకులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో విలియం షేక్స్‌పియర్ జయంతి, వర్ధంతి సందర్భంగా ఆంగ్ల భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో పుస్తక ప్రదర్శన, టంగ్ ట్విస్టర్స్, రీడిల్స్, వివిధ ఆంగ్ల రచయితల పోస్టర్ ప్రదర్శన వంటి ప్రత్యేక పోటీలను నిర్వహించి, గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డి.సుమతి మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ఆంగ్లంపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.శివలీల, ఇంగ్లిష్ హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్ తుల్సి బిశ్వాస్, సునీత, రజిత, ఏ.శైలజ పాల్గొన్నారు. అనంతరం అంతర్జాతీయ పుస్తక దినోత్సవం సందర్భంగా కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ ఆర్. లలిత విద్యార్థులకు ఎఫెక్టివ్ బుక్ రీడింగ్ టెక్నిక్స్ అనే అంశంపై ఓరియంటేషన్‌ను ఇచ్చి, విద్యార్థులలో పఠనా శక్తిని, జ్ఞాపక శక్తిని మెరుగుపర్చుకోవడంపై వివరించారు.

'ఉపాధి కూలీ రెట్టింపు ఘనత మోదీ దే..'



దర్మరావ్‌పేటలో కూలీలతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

దండేపల్లి: ఉపాధిహామీ పథకం కూలీలకు కూలీ రెట్టింపు చేసిన ఘనత ప్రధాని నరేంద్రమోదీదే అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. దండేపల్లి మండలం ధర్మరావ్‌పేట, కొండాపూర్ గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఉపాధిహామీ పనిప్రదేశాలకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటేసీ కేంద్రంలో మళ్లీ బీజేపీని అధికారంలోకి తేవాలన్నారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'గిరిజన చట్టం నిర్వీర్యం'

మందమర్రిరూరల్: మందమర్రిలో అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు గిరిజన చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని తుడందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రాల రవీందర్ ఆరోపించారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల భూములను గిరిజనేతరులకు అమ్మరాదనే నిబంధన ఉన్నప్పటికీ, రియల్ వ్యాపారులు 99ఏండ్ల లీజ్ పేరిట కాగితాలు రాయించుకుని గిరిజనులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. తుడందెబ్బ నాయకులు సత్యనారాయణ, వెంకటి, రాంబాబు, తిరుపతి, గోపాల్ రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

- 10 మంది మైనర్లు, పేరెంట్స్‌కు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో రామగుండం సీపీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు మైనర్ డ్రైవింగ్‌పై మంగళవారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో 10 మంది మైనర్లు, వాహనాలు పట్టుబడగా వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ట్రాఫిక్ సీఐ నరేష్‌కుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నరేష్‌కుమార్ మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇస్తే వారితో పాటు వాహనం ఇచ్చిన వారిపై సైతం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పట్టుబడిన వారి పేర్లు, వారి తల్లిదండ్రుల పేర్లు, సెల్ నంబర్లు నమోదు చేసుకొని వదిలేశారు. ఎలక్ట్రిక్ బైక్‌లు సైతం మైనర్లకు ఇవ్వకూడదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై దివాకర్, నందగోపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

వంటషెడ్డు.. బేస్‌మెంట్‌కే పరిమితం..!



భీమారం: మండల కేంద్రంలోని ఆర్కెపల్లి గూడెంలోని ప్రభుత్వప్రాథమిక పాఠశాలలో నిర్మిస్తున్న వంటశాల నిర్మాణ పనులు బేస్‌మెంటకే పరిమితమయ్యాయి. దీంతో మధ్యాహ్న భోజనం వండేందుకు మహిళలు నానా అవస్థలు పడుతున్నారు. దాదాపు ఐదేళ్ల క్రితం వంటశాల మంజూరు ఐనప్పటికీ దాని నిర్మాణం నేటికీ పూర్తి చేయలేదు. దీంతో ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ వేసవిలోనైనా నిర్మించి వచ్చే విద్యా సంవత్సంలోనైనా ఉపయోగంలోకి తేవాలని కోరుతున్నారు.

ఆర్థిక సాయం

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు తిమ్మాపూర్‌కు చెందిన చిలుక రాజేశ్వరీ–రాజంల కుమార్తె రమ్య వివాహం కోసం రామకృష్ణాపూర్ యువత జనం కోసం సంస్థ వారు మంగళవారం రూ.7వేల ఆర్థిక సాయాన్ని అందించారు. నిరుపేద కుటుంబం కావడంతో తమవంతు సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యువత అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేష్, తిరుపతి, బింగి శివకిరణ్, పలిగిరి కనకరాజు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎంగిలి మధునయ్య ఇటీవల మృతి చెందగా, అతడి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు గుండు తిరుపతి, పాడేటి రవి మంగళవారం సందర్శించి వారి కుటుంబానికి సోపతి వెల్ఫేర్ సొసైటీ, ఫ్రెండ్స్ సొసైటీల నుంచి రూ.10వేల నగదు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జర్పుల రాజ్‌కుమార్, నాయకులు అన్నమొల్ల అశోక్, కలగూర లింగన్న, రాజబాపు, మహేష్ పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి జిల్లాపరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం చేసి మానవత్వం చాటుకున్నారు. 9వ తరగతి విద్యార్థి సమీర్ తండ్రి అనారోగ్యంతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు మంగళవారం ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరస్వామి, ఉపాధ్యాయులు పుష్పలత, బండ శాంకరి, పల్లె కృష్ణగోపాల్‌రావు, జ్యోతి, మాదవిలత, అర్చన తమవంతుగా రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

విజయవంతం చేయండి

నస్పూర్: ఆటో డ్రైవర్లకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆటో యూనియన్స్ రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో నేటి నుంచి మూడు రోజులు చేపట్టనున్న వివిధ నిరసన కార్యక్రమాల్లో ఆటో డ్రైవర్లు, ఓనర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆటో యూనియన్స్ జేఏసీ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి, నస్పూర్ టౌన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు చెల్ల విక్రమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు తహసీల్దార్లకు, 26న కలెక్టర్లకు, 28న ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి



ఐకేపీ మహిళలతో మాట్లాడుతున్న ఎంపీడీవో



తాండూర్: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అధికారులు

భీమారం: అమ్మ ఆదర్శపాఠశాలల్లో చేపట్టనున్న పనులు నాణ్యతతో ఉండేలా చూడాలని మహిళాగ్రూపు సభ్యులను ఎంపీడీవో రాధారాథోడ్ కోరారు. అమ్మఆదర్శ పాఠశాల పనులపై మంగళవారం నర్సింగాపూర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ.. ఐకేపీ మహిళా సంఘాలకు ప్రభుత్వం పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక బాధ్యత పెట్టిందన్నారు. ఈ మేరకు పనులు చేపట్టి పాఠశాలలు తిరిగి తెరిచేలోపు పాఠశాలలు అందంగా తీర్చిదిద్దాలని కోరారు. భీమారం, కొత్తగూడెం, ధర్మారం, పోతన్‌పల్లి పాఠశాలలను ఎంపీడీవో తనిఖీ చేసి పనులను పరిశీలించారు. ఇందులో ఆర్‌అండ్‌బీ ఏఈ అనూషతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల తనిఖీ

తాండూర్: మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలను మంగళవారం ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో ప్రభాకర్ తనిఖీ చేశారు. పెగడపల్లి, కొత్తపల్లి, రేపల్లెవాడ, అశోక్‌నగర్, కాపువాడ, గంపలపల్లి, కొమ్ముగూడెం ప్రాథమిక పాఠశాలలు, అచలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, చైర్మన్‌లకు అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఏ.ఈ విష్ణు, ఏపీఎం పోమా నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు



నృత్యం చేస్తున్న విద్యార్థిని



కాలేజీ పేరు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: మిమ్స్ డిగ్రీ కళాశాలలో వీడ్కోలు కార్యక్రమంలో విద్యార్థుల ఆటపాట అలరించింది. ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కళాశాల ఎదుగుదలకు కారణమైన అకాడమిక్ ప్లాన్, విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు. యూనివర్సిటీ స్థాయిలో సాధించిన మార్క్స్ గాను విద్యార్థులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్‌రాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, డైరెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి కొనసాగుతున్న వలసలు



పార్టీలో చేరిన 8వ వార్డు నాయకులతో ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: పాతమంచిర్యాలలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 8వ వార్డు మాజీ కౌన్సిలర్ కోదాడి కమలాదేవి రమేశ్ దంపతులతో పాటు, వంద మంది మంగళవారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయంతో గెలుపొందుతుందన్నారు. 8వ వార్డు కౌన్సిలర్ సునిత, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నరేశ్, నాయకులు బొలిశెట్టి కిషన్ పాల్గొన్నారు.

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గడిపెల్లి సత్యం, పార్టీ సీనియర్ నాయకులు బొలిశెట్టి లింగారెడ్డి, పరమేశ్ మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు బొమ్మెన గంగాధర్ పాల్గొన్నారు.

ఇంటిబాట పట్టిన విద్యార్థులు



దండేపల్లి: పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో హాస్టళ్లతో పాటు, కస్తూర్బా పాఠశాల విద్యార్థులు మంగళవారం ఇంటిబాట పట్టారు. బ్యాగులు సర్దుకుని ఇళ్లకు పయనం అయ్యారు. తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లడంతో బస్టాప్‌ల వద్ద సందడి కనిపించింది.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899